క్లుప్తంగా

ఘనంగా ఇర్ఫాని దర్గా ఉర్సు


ప్రార్థనలు నిర్వహిస్తున్న చింతా ప్రభాకర్

సంగారెడ్డిటౌన్: సంగారెడ్డి పట్టణ శివారులోని ఇర్ఫాని దర్గాలో 21వ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం మత పెద్దలు దీపారాధన, అన్నదాన కార్యక్రమం నిర్వహించారని దర్గా నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి దర్గా పీఠాధిపతులు, సంగారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ ఇతర ప్రజాప్రతినిధులు హాజరై ప్రార్థనలు నిర్వహించారు.

అంతర్రాష్ట్ర చెక్ పోస్టు పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు

న్యాల్‌కల్(జహీరాబాద్): రాష్ట్రంలోకి డబ్బు, మద్యం రాకుండా చూడాలని ఎన్నికల పరిశీలకుడు వెంకట కృష్ణన్ లేవన్ ఆదేశించారు. మండల పరిధిలోని హుస్సెళ్లి వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్ పోస్టును ఆయన శనివారం తనిఖీ చేశారు. కర్ణాటక నుంచి వచ్చే వాహనాలను క్షుణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. పట్టుబడిన డబ్బు, మద్యం, ఇతర అంశాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట జహీరాబాద్ డీఎస్పీ రఘు, తహసీల్దార్ రాజిరెడ్డి, ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

విద్యార్థులను పనులకు పంపవద్దు


సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

న్యాల్‌కల్(జహీరాబాద్): పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నందున వారికి వ్యవసాయ పనులకు పంపవద్దని న్యాల్‌కల్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం తిరుపతి సచ్చిదానందరెడ్డి సూచించారు. శనివారం స్థానిక పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను రెండు పూటల కొనసాగుతున్న ప్రత్యేక తరగతులకు పంపించాలన్నారు.

హెల్ప్‌డెస్క్ ఏర్పాటు


హెల్ప్‌డెస్క్‌ను పరిశీలిస్తున్న అధికారులు

నారాయణఖేడ్: స్థానిక రిటర్నింగ్ కార్యాలయంలో అధికారులు నామినేషన్ల దాఖలుకు సంబంధించి సందేహాల నివృత్తికి హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్టు రిటర్నింగ్ అధికారి వెంకటేష్ తెలిపారు. అధికారులు తెలిపారు. శనివారం ఎలాంటి నామినేషన్ దాఖలు కాలేదని ఆయన తెలిపారు.

సైబర్ వలలో సివిల్ ఇంజనీర్

- రూ.32.43లక్షల స్వాహా
- వేరొక ఘటనలో మరో రూ.5 లక్షలు



పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ వచ్చిన మెసేజ్‌కు స్పందించిన ఓ సివిల్ ఇంజనీర్ రూ.32 లక్షల 43 వేలు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని త్రిపుర ఎన్ క్లేవ్‌కి చెందిన సివిల్ ఇంజనీర్ పార్ట్ టైం జాబ్ అంటూ తన టెలిగ్రామ్‌కు ఆగస్టు 28న మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు అతడికి ఒక వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఆ ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలు పెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం 32 లక్షలు 43 వేలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతో పాటు కమీషన్ చూపిస్తూ వచ్చారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా వారు స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరొక ఘటనలో మహిళ...

అమీన్‌పూర్ పరిధిలోని ఎంపర్ మీడోస్‌కు చెందిన ఓ మహిళకు నవంబర్ 2న మీషో యాప్‌లో షాపింగ్ చేసింది. ఆ తర్వాత ఆమెకు కస్టమర్ కేర్ రిప్రెజెంటేటివ్ నుంచి తన ఫోనుకు ఓ లింక్ వచ్చింది. దీంతో బాధితురాలు ఆ లింకు క్లిక్ చేసి వివరాలను నమోదు చేసింది. అనంతరం ఆమె ఖాతాలో ఉన్న ఐదు లక్షలు సైబర్ మోసగాళ్లు కాజేశారు. దీంతో బాధితురాలు గుర్తించి ముందుగా సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, శనివారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

సంగారెడ్డి టౌన్ : వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని తెలంగాణ రాష్ట్ర అటవీ సంరక్షణ అధికారి ఎంసీ పార్‌గైన్ అన్నారు. శనివారం మంజీరా వన్యప్రాణి సంరక్షణ, పర్యావరణ విజ్ఞాన, మొసళ్ల పెంపక కేంద్రాలను పరిశీలించారు. ఈ అభయారణ్యంలో ఉన్న వన్యప్రాణులను రక్షించడంతో పాటు సందర్శకుల కోసం సౌకర్యాలు కల్పించాలన్నారు. దీని గురించి అధికారుల ద్వారా తెలుసుకున్నారు. తొలుత మంజీరా ప్రాజెక్టును కూడా సందర్శించారు. ఆయన వెంట చార్మినార్ సర్కిల్ అటవీ అధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మంజీరా డ్యాంను సందర్శిస్తున్న పార్‌గైన్

సీనియర్ సివిల్ జడ్జి తనిఖీలు

జహీరాబాద్ టౌన్: పస్తాపూర్ వద్ద గల ఎంపీఐ కార్యాలయాన్ని శనివారం సీనియర్ సివిల్ జడ్జి కె.సూరికృష్ణ తనిఖీ చేశారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో కార్యాలయంలోని ఉచిత న్యాయ సేవా సహాయ కేంద్రంలో సహాయకుల రికార్డులను పరిశీలించారు. మోటార్ వాహనాల చట్టం ఉల్లాంఘనలపై ఆరా తీసి ఇన్‌స్పెక్టర్ జయ ప్రకాష్‌రెడ్డితో మాట్లాడారు. కార్యక్రమంలో సబ్‌రిజిస్ట్రార్ రాజేశ్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న జడ్జి సూరికృష్ణ

పోలింగ్‌స్టేషన్ సందర్శించిన డీఎస్పీ

జిన్నారం(పటాన్‌చెరు): స్థానిక పోలింగ్‌స్టేషన్‌లను డీఎస్పీ పురుషోత్తంరెడ్డి సందర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిన్నారంలో క్లిష్టమైన పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించామని చెప్పారు. అనంతరం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులను కలిశారు. అన్ని రంగాలలో ముందుకు సాగలని వారికి సూచించారు. ఆయన వెంట సీఐ వేణుకుమార్, ఎస్ఐ విజయరావు ఉన్నారు.


పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న పురుషోత్తం రెడ్డి

కొనసాగుతున్న 'సాహితి' బాధితుల దీక్ష

- సందర్శించనున్న హైకోర్టు న్యాయవాది

పటాన్‌చెరు: అమీన్‌పూర్‌లో సాహితి సంస్థ లాంచింగ్ ఆఫర్‌లో డబ్బులు చెల్లించి నష్టపోయిన వినియోగదారులు కొన్ని నెలలుగా నిరసన దీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఆదివారం ఆ దీక్ష శిబిరాన్ని హైకోర్టు న్యాయవాది కృష్ణ కాంత్, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ సందర్శించనున్నారు. ఈ మేరకు శనివారం బాధితులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరసన వ్యక్తం చేస్తున్నా పట్టించుకునేవారు లేరని, తమకు న్యాయం జరిగేంత వరకు ఉద్యమిస్తామని చెప్పారు.

వివాదాస్పద భూముల్లో నిర్మాణాలు

పటాన్‌చెరు: కోర్టు పరిధిలో ఉన్న భూముల్లో నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని న్యాయవాది ఓం ప్రకాష్ ఆరోపించారు. అమీన్‌పూర్ 947/4 సర్వే నెంబరు గల వివాదాస్పద భూమి కోర్టు పరిధిలో ఉందన్నారు. అనుమతులు పొందడానికి ఆస్కారం లేనిప్పటికీ నిర్మాణాలు ఎలా కొనసాగుతున్నాయో ప్రశ్నార్థకంగా మారిందన్నారు. నిర్మాణాల విషయం అధికారులకు తెలిసినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని, వారికి సహకరిస్తున్నారని శనివారం ఓం ప్రకాశ్ విలేకరులకు తెలిపారు. అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అవకాశం ఇస్తే.. అభివృద్ధి చూపిస్తా

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి నందీశ్వర్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): పటాన్‌చెరు నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని, తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి నందీశ్వర్‌గౌడ్ ఓటర్లను కోరారు. జిన్నారంతో పాటు ఆయా గ్రామాల్లో ఆయన శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి, అనంతరం గ్రామాల్లోని ఇంటింటికీ తిరిగి తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా నందీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనకబడిందని, ఒక్కసారి అవకాశం ఇస్తే అన్ని గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ప్రచారంలో ప్రతాప్ రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలతో ఎమ్మెల్యే జగ్గారెడ్డి సమావేశం

సంగారెడ్డి: రానున్న ఎన్నికలలో సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి శనివారం మైనార్టీ నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సమష్టి కృషితో పని చేయాలని కోరారు. తనకు మద్దతు ఇచ్చి గెలిపించాలని అభ్యర్థించారు.

రైతుల బకాయిలు చెల్లించి ఓట్లు అడగాలి

కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్

జహీరాబాద్ టౌన్: రైతులపై బీఆర్ఎస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే చెరకు రైతుల బకాయిలు చెల్లించి ఓట్లు అడగాలని కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ ధ్వజమెత్తారు. ట్రైడెంట్ చెక్కర కర్మాగారం వద్ద శనివారం రైతులను కలిసి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల బకాయిలు, కార్మికుల వేతనాలను చెల్లించకుండా యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుంటే మంత్రి హరీశ్‌రావు గమ్మునా ఉన్నారని విమర్శించారు. ఏడాది నుంచి బిల్లులు రాక రైతులు నానాఅవస్థ పడుతున్నారని, ఓట్లు అడగానికి వచ్చే బీఆర్ఎస్ నాయకులను నిలదీయాలని రైతులను కోరారు. రైతుల పక్షాన ఉండి న్యాయం జరిగే వరకు పోరాడుతామని చంద్రశేఖర్ అన్నారు.

వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం

జిల్లా కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: అత్యవసర సేవల్లో విధులు నిర్వహిస్తున్న పలు శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పిస్తున్నట్లు ఎన్నికల కమిషన్ వెల్లడించింది. అత్యవసర ఓటర్ సర్వీస్ విభాగం కింద పలు శాఖలకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శరత్ తెలిపారు. అత్యవసర సేవల విభాగంలో ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, భారతీయ రైల్వే, దూరదర్శన్, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, ఆల్ ఇండియా రేడియో, విద్యుత్ శాఖ, ఆరోగ్య కుటుంబ సంక్షేమం, రాష్ట్ర రవాణా సంస్థ, ఆహారం పౌర సేవలు, బీఎస్ఎన్ఎల్, పోలింగ్ రోజున కవరేజ్ కోసం ఈసీఐ ద్వారా అథారిటీ లేఖలు పొందిన మీడియా వ్యక్తులు, అగ్నిమాపక సేవలలో పనిచేస్తున్న వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించినట్లు ఆయన తెలిపారు. సంబంధిత శాసనసభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి పూర్తి వివరాలతో నింపిన ఫారం 12 ఈ ఇవ్వాలని సూచించారు. ఓటింగ్ కేంద్రాలు, సమయ వివరాలు దరఖాస్తుదారులకు ఎస్ఎంఎస్ లేదా బూత్ లెవెల్ అధికారుల ద్వారా తెలియజేస్తారని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ శరత్ సూచించారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్

సంగారెడ్డి: మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ చెప్పారు. 16వ వార్డులో మాజీ పీఏసీఎస్ చైర్మన్ నాసిబుద్దీన్ ఆధ్వర్యంలో మైనార్టీ మత పెద్దల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రభాకర్ మాట్లాడుతూ మైనార్టీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిల్ కొత్తపల్లి నాని, ఆర్‌టీఏ మెంబర్ రషీద్ పాల్గొన్నారు.

గణేష్ గడ్డ వరకు పాదయాత్ర

సదాశివపేట (సంగారెడ్డి): చింతా ప్రభాకర్ విజయం సాధించాల గణేశ్ విగ్రహానికి పూజలు నిర్వహించడానికి చేపట్టిన పాదయాత్రను చింతా సాయినాథ్ శనివారం ప్రారంభించారు.


ముస్లిం మత పెద్దలతో చింతా ప్రభాకర్

చింతా ప్రభాకర్‌ను గెలిపించాలి

సదాశివపేట(సంగారెడ్డి): చింతా ప్రభాకర్‌ను గెలిపించాలని 26 వార్డుల పరిధిలో పార్టీ శ్రేణులు శనివారం ప్రచారం నిర్వహించాయి. మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సంగారెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారం మున్సిపాలిటీలోని ఐటీసీ ప్రైవేట్ లిమిటెడ్ కార్మికులకు శనివారం మున్సిపల్ కమీషనర్ సంగారెడ్డి, ఆర్ఓ శ్రీధర్ ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ కార్మికులంతా తప్పనిసరిగా ఓటును వినియోగించాలని, డబ్బు, మద్యం లాంటి వాటికి ఓటును దుర్వినియోగం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఐటీసీ ప్రైవేట్ లిమిటెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమంతుడికి ఘటాభిషేకం


పూర్ణాహుతి నిర్వహిస్తున్న భక్తులు

నారాయణఖేడ్: జంట గ్రామమైన మంగల్‌పేట్‌లోని హనుమాన్ ఆలయంలో శనివారం ఘటాభిషేకం, హోమం నిర్వహించారు. ఉదయం నుంచి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు హనుమాన్ విగ్రహాన్ని 1008 తమలపాకులతో అలంకరించారు. లోక కల్యాణం కోసం ఈ కార్యక్రమాలు నిర్వహించామని అర్చకుడు గురుజ్యోషి చెప్పారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం(పటాన్‌చెరు): కాజీపల్లిలో సర్వే నంబర్ 181లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. శనివారం ఈ విషయం ఆర్ఐ శంకర్ నారాయణ దృష్టికి రావడంతో వాటిని కూల్చివేశారు. ఎవరైనా అక్రమంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు దివ్యాంగులకు శిక్షణ

నారాయణఖేడ్: దివ్యాంగులకు ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాల కల్పనకు నారాయణఖేడ్‌లో సోమవారం కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకుడు జైపాల్ తెలిపారు. స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో ఐకేపీ భవనంలో జరగనున్న ఈ కార్యక్రమంలో పాల్గొని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 94413 84182, 95538 73340 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ

జహీరాబాద్ టౌన్: స్థానిక డీడీఎస్ కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం కర్ణాటక బసవ కల్యాణ్ రైతులకు సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఇన్‌చార్జి డాక్టర్ స్నేహలత రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రీయ వ్యవసాయం ఉద్దేశ్యం, చిరుధాన్యాల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శైలజ, హేమలత, కేవీకే అధికారులు స్వామి, బి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని చేర్యాల జెడ్పీహెచ్ఎస్ లో శనివారం మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం జరిగింది. బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా డీహెచ్ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ యాదగిరి బాలల హక్కులు, బాల్య వివాహ నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. హెచ్ఎం వెంకటరాజయ్య, విశాల పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

జిన్నారం(పటాన్‌చెరు): ఎన్నికల ప్రచార రథం ఢీకొని మహిళ గాయపడింది. జిన్నారంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుందని ఎస్ఐ విజయరావు తెలిపారు. గ్రామంలో బీజేపీ ప్రచార రథం వెనక్కి తీస్తుండగా అక్కడ పనిచేస్తున్న దప్పు నర్సమ్మను ఢీకొనడంతో గాయపడిందని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ప్రచార రథం డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

6.60 లీటర్ల మద్యం పట్టివేత

పటాన్‌చెరు టౌన్: 6.60 లీటర్ల మద్యంను పోలీసులు పట్టుకున్నారు. బీరంగూడ మంజీరా కాలనీకి చెందిన వడ్డె లక్ష్మి మద్యం విక్రయిస్తోందని సమాచారం రావడంతో ఎస్ఐ మల్లయ్య సిబ్బందితో కలిసి శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 6.60 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశారు.

విద్యార్థుల పరీక్షల నిర్వహణ అభినందనీయం

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని ప్రిన్సిపాల్ పతంజలి పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 3, 6, 9 తరగతులు విద్యార్థులకు శనివారం రాష్ట్ర విద్యా సాఫల్య సర్వేలో భాగంగా ఓఎంఆర్ ఆధారిత పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 26 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఈ సర్వేలో పాల్గొని పరీక్షలు నిర్వహించారు.

పిల్లల కోసం 'తొలిమెట్టు'

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు 'పిల్లల కోసం తొలిమెట్టు' శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలలో టీచర్ల కొరత ఉందని, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు వారంలో ఒక రోజు చిన్న పిల్లలకు బోధించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో బోధించడం వారి సామాజిక బాధ్యత అన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీహరి రెడ్డి పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా వాలంటీర్లకు శిక్షణ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ - 2 ప్రోగ్రాం అధికారి డాక్టర్ జానారెడ్డి ఈ కార్యక్రమం ఆవశ్యకతను వాలంటీర్లకు వివరించారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

జహీరాబాద్ టౌన్: విద్యను క్రమశిక్షణతో అభ్యసించాలని వైద్యాధికారి డాక్టర్ సీతారామరాజు సూచించారు. స్థానిక శ్రీగాయత్రి జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్ పార్టీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుకున్న లక్ష్యాన్ని చేరుకోడానికి ప్రణాళిక ప్రకారం విద్యను అభ్యసించి భవిష్‌త్‌కు మంచి బాటలు వేసుకోవాలని సూచించారు. విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంక్‌లు సాధించడం అభినందనీయమని ప్రిన్సిపాల్ శాంతకుమార్ అన్నారు. విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాంతకుమార్, అధ్యక్షుడు శివన్న, ప్రధాన కార్యదర్శి సిద్దన్న, డైరెక్టర్లు కృష్ణచైతన్య పాల్గొన్నారు.

కార్మిక రంగానికి ఆత్మబంధువు సీఎం కేసీఆర్

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు

పటాన్‌చెరు టౌన్: ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం రాష్ట్రంలోని పారిశ్రామిక రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి యాజమాన్యాలు, అటు కార్మికుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపిన గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రశంసించారు. నియోజకవర్గంలో గత ప్రభుత్వాల హయాంలో నిత్యం లాకౌట్లు, విద్యుత్ కోసం ధర్నాలతో పారిశ్రామిక రంగం దినదిన గండంగా ఉండేదని, కేసీఆర్ నాయకత్వంలో కార్మికులు ఆనందంగా ఉంటున్నారన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన చిన్న తరహా పరిశ్రమల సమాఖ్య ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ కార్మిక రంగం నుంచి వచ్చిన తనకు కార్మికులు, యాజమాన్యాల సమస్యలపై అవగాహన ఉందన్నారు. కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమం మరింత ముందుకు వెళ్లాలంటే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయానికి సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నగేశ్ కురుమ, శ్రీధర్ చారి, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మతతత్వ పార్టీకి ఓటేస్తే అంధకారమే

పటాన్‌చెరు: పోరాడి సాధించుకున్న తెలంగాణలో మతతత్వ పార్టీలకు చోటు లేదని, పొరపాటున ఓటు వేస్తే ప్రజలకు అంధకారమే మిగులుతుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీజేపీ కౌన్సిలర్లు సాయి కిరణ్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, కోఆప్షన్ సభ్యుడు రంగారెడ్డి, సీనియర్ నాయకులు నారాయణ యాదవ్, ఉదయ్, పవన్ యాదవ్ తదితరులు మాజీ జెడ్పీటీసీ కోలన్ బాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మతతత్వ నినాదమే అజెండాగా సాగుతున్న బీజేపీకి డిపాజిట్లు సైతం దక్కబోవన్నారు. రాష్ట్రానికి కేటాయించే నిధులతో పాటు మెడికల్ కళాశాల కేటాయింపుల్లోనూ బీజేపీ తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఓటుకు నోటు కేసులో నిందితుడుగా ఉన్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి నేడు రేటెంత రెడ్డిగా మారిపోయారని విమర్శించారు. మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, కౌన్సిలర్ వేణుపాల్ రెడ్డి, సతీశ్ బాల మణి రత్నం, బీరప్ప, శైలజ పుండరీకం పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

పటాన్‌చెరు: బీఆర్ఎస్ పార్టీలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు చేరికల జోరు కొనసాగుతూనే ఉంది. తాజాగా అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట, పటాన్‌చెరు మండలం ముత్తంగి జై భీమ్ కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం సాయంత్రం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు సీనియర్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. కిష్టారెడ్డిపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మణ్, మహేందర్, బాబురావు, రవి, యూసుఫ్, సాయికుమార్, ముత్తంగి జై భీమ్ కాలనీకి చెందిన విఠల్, ఆంటోని, పెంటయ్య, ఆనంద్, దుర్గయ్య తదితరులు పార్టీలో చేరారు.

జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, పటాన్‌చెరు వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, కిష్టారెడ్డిపేట సర్పంచ్ కృష్ణ, వైస్ ఎంపీపీ సునీత సత్యనారాయణ, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి ఏకగ్రీవ మద్దతు


కులం, మతం, ప్రాంతం తేడా లేకుండా నియోజకవర్గ పరిధిలోని అన్ని వర్గాల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నామని, అభివృద్ధి సంక్షేమాన్ని చూసి అన్ని సంఘాలు పార్టీకి మద్దతు పలకడం సంతోషకరంగా ఉందన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని అరవ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అరవ వడ్డెర సంఘం అధ్యక్షుడు కుమార్ ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం ఎమ్మెల్యే జీఎంఆర్‌ను ఘనంగా సన్మానించి ఏకగ్రీవ మద్దతు ప్రకటించారు. సీనియర్ నాయకుడు చంద్రారెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల ప్రచారం

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డికి మద్దతుగా శనివారం నాయకులు ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు హుస్సేన్, ఎంపీటీసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. గుమ్మడిదల మండలంలో జరిగిన అభివృద్ధిని ఓటర్లకు వివరించారు. మహిపాల్ రెడ్డిని గెలిపించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఆర్యవైశ్య మహాసభ మద్దతు

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య మహాసభ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ పటాన్‌చెరు అభ్యర్థి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హాజరయ్యారు. ఎన్నికలలో విజయానికి సంపూర్ణ సహకారం అందిస్తామని మహాసభ ప్రతినిధులు స్పష్టం చేశారు. కార్పొరేటర్ మెట్టు కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను గజమాలతో సన్మానిస్తున్న ఆర్యవైశ్య మహాసభ మహిళలు